ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 21 అక్టోబరు 2024





# మానేరుపై మరో వంతెన



రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై వంతెన నిర్మించనున్న ప్రాంతం

- రూప్‌నారాయణపేట వద్ద చేపట్టనున్న నిర్మాణం
- రూ. 80 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- తగ్గనున్న 15 కిలోమీటర్ల వరకు దూర భారం
- నెరవేరనున్న రెండు దశాబ్దాల నాటి కల

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మానేరుపై మరో వంతెన నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల నెరవేరనున్నది. ఓదెల మండలం రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 80కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈనెల 18వ తేదీన జీవో ఆర్‌టీ నంబర్ 801 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 15 కిలోమీటర్ల దూర భారం తగ్గనున్నది. ఇప్పటి వరకు మానేరు నదిపై ఐదు వంతెనలు ఉండగా, ఈ వంతెన ఆరవది. జిల్లాలోని ఓదెల మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉండగా, రూప్‌నారాయణ పేట వద్ద నిర్మించనున్న వంతెన 18 గ్రామాల ప్రజలకు ప్రయోజనకరంగా మారనున్నది. అలాగే పెద్దపల్లి నుంచి జమ్మికుంటకు వెళ్లేందుకు పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ తదితర ప్రాంతాల ప్రజలకు దూర భారం తప్పనున్నది. ఓదెల మండల వాసులు ప్రస్తుతం జమ్మికుంటకు వెళ్లేందుకు పొత్కపల్లి, షానగొండ, ఇందుర్తి, బాయమ్మపల్లి, గుంపుల మీదుగా మానేరు వంతెన మీదుగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగుల, గండ్రపల్లి, నాగంపేట్ మీదుగా జమ్మికుంటకు వెళ్లాల్సి వస్తున్నది. ఇది ఓదెల నుంచి 25 కిలోమీటర్ల వరకు దూరం ఉంటుంది. రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై వంతెన నిర్మిస్తే అవతలి ఒడ్డున కల్లుపల్లె, విలాసాగర్ మీదుగా నేరుగా జమ్మికుంటకు వెళ్లవచ్చు. దీంతో 15 కిలోమీటర్ల దూర భారం తగ్గడంతో పాటు సమయం, పెట్రోల్, డీజిల్ ఆదా కానున్నది. ఓదెల, జమ్మికుంట, హుజూరాబాద్, హన్మకొండ, వరంగల్‌కు మరింత కనెక్టివిటీ పెరగనున్నది. 1990కి పూర్వం ఓదెల నుంచి జమ్మికుంటకు వెళ్లాంటే కరీంనగర్ మీదుగా వెళ్లాల్సి వచ్చేది. లేదంటే రైలులో వెళుతుంటారు. గుంపుల వద్ద మానేరు వంతెన నిర్మాణం అయిన తర్వాత జమ్మికుంట, వరంగల్‌కు రాకపోకలు సులు వుగా మారాయి. ఆ తదనంతరం 1999 నుంచి రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై మరో వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజల నుంచి డిమాండ్ రాగా కార్యరూపం దాల్చలేదు.

**● ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు..**

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మానేరు నదిపై 3 కొత్త వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల వద్ద ఒక వంతెన, ముత్తారం మండలం ఓడేడు వద్ద ఒక వంతెన, ఖమ్మంపల్లి వద్ద ఒక వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఇందులో నీరుకుళ్ల వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ, లారీలు, బస్సులు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లేందుకు

(మిగతా 8వ పేజీలో..)

**రెండు దశాబ్దాల కల నెరవేరనున్నది..**
**- చింతకుంట విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే**



ఓదెల మండలం రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై వంతెన నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజల రెండు దశాబ్దాల కల నెరవేరనున్నది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మానేరుపై మరో వంతెన నిర్మాణం కోసం సీఎం, మంత్రిపై ఒత్తిడి తీసుకరావడం వల్ల రూ.80 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే వంతెన నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించనున్నారు. టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభం కానున్నాయి. రెండేళ్లలో వంతెన అందుబాటులోకి రానున్నది.

## అన్ని హంగులతో పెద్దపల్లి పట్టణాభివృద్ధికి కృషి..

**- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని అన్ని హంగుల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. పట్టణంలోని 19, 23 వార్డులలో టీయూఎఫ్ఐడీసీ నిధులు కోటి నలభైతొమ్మిదిన్నర లక్షల రూపాయలతో పలు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, షెడ్, కాంపౌండ్ వాల్ నూతన నిర్మాణాలకు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణాన్ని సుందరికరమైన పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రజలందరూ సహకరించాలని, అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణాల నాణ్యత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అలాగే అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వార్డులో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి వచ్చాయని దశల వారీగా పరిష్కరించి తీరుతామని హామీ ఇచ్చారు. గత పాలకుల హయంలో పెద్దపల్లి పట్టణాన్ని అధ్వానమైన స్థితికి తీసుకొచ్చారని, ఎక్కడ చూసినా గుంతలతో కూడిన రోడ్లు దర్శనమిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నూగిళ్ళ మల్లయ్య, బొడ్డుపెల్లి శ్రీనివాస్, తాడూరి శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

### బోనం ఎత్తిన పెద్దపల్లి ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చందపల్లిలో బొడ్రాయి, పోచమ్మ అమ్మవారి ప్రతిష్ఠాపనలో ఆదివారం ఎమ్మెల్యే విజయరమణరావు బోనమెత్తుకొని పాల్గొన్నారు. దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నూగిళ్ళ మల్లయ్య, జడల సురేందర్, తూముల సుభాష్, భూతగడ్డ సంపత్ స్థానికులు పాల్గొన్నారు.

### తెలంగాణ పద్మశాలి సంఘం కార్యదర్శిగా లక్ష్మణ్

ఎలిగేడు, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గ్యాజంగి లక్ష్మణ్‌ను తెలంగాణ పద్మశాలి సంఘం కార్యదర్శిగా నియమించారు. ఆదివారం హైదరాబాద్ ఎల్బీనగర్‌లో జరిగిన పద్మశాలి ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కామార్తం మురళి, ప్రధాన కార్యదర్శి రామచంద్ర రావు చేతుల మీదుగా గ్యాజంగి లక్ష్మణ్ కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందుకున్నారు. నానియామకానికి సహకరించిన పెద్దపల్లి జిల్లా హుడా కమిటీ చైర్మన్ వల్స నీలయ్యకు ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గుండేటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

**డిప్యూటేషన్లలో సీనియర్ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలి**
**- సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుల డిమాండ్**

8



సమావేశమైన పూర్వ విద్యార్థులు

**పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

8

## న్యూస్ బాక్స్

### కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా కార్యకర్తలు సైనికుల్లా పని చేసి కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు, రామగుండంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చేస్తున్న అభివృద్ధి పనులను గడప గడపకు వెళ్లి వివరించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎలక్షన్ కోసం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారి డాక్యుమెంట్స్ ఆధార్‌కార్డు, డిగ్రీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఓటర్ ఐడీ కార్డులను తీసుకుని వారి ఓటర్ ఐడి ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### సింగరేణి ఎస్టేట్ అధికారిపై చర్యలు తీసుకోండి

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎస్టేట్ అధికారి సాంబశివరావు తనను దూషించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పని చేసే కానిస్టేబుల్ అర్నకొండ సదానందం డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్టాండ్ కాలనీలో తాను 200గజాల స్థలంలో ఇంటిని నిర్మించుకున్నానని, ఇంటి నిర్మాణం నుంచి తనను మానసికంగా సాంబశివరావు వేధింపులకు గురిచేస్తూ రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, కులం పేరుతో దూషించిన సాంబశివరావుపై ఈనెల 4న గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవడంలేదని, సీపీకి కూడా ఫిర్యాదు చేశానని, సాంబశివరావుపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు.

### పాఠశాలపై చర్య తీసుకోవాలి

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజు గోదావరిఖని సంజయ్‌గాంధీనగర్‌లోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని, యాజమాన్యం విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని తెలుసుకొని పాఠశాలకు వెళ్లి అడ్డుకున్నారు. అనంతరం ఎంఈవోకు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా స్పందించిన అధికారి వెంటనే నిర్వహించవద్దని తెలుపగా విద్యార్థులను ఇంటికి పంపించారని ప్రీతం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మాతంగి సాగర్, కల్వల సునీల్, గొడిశెల ప్రణీత్ పాల్గొన్నారు.

## సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ మార్కెట్ కమిటీలు ఖరారు

పెద్దపల్లి, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని సుల్తానా బాద్, కాల్వశ్రీరాంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక వర్గాలు ఖరారయ్యాయి. దీనికి సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి. సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రధాన అనుచరుడు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు మినుపాల స్వరూప భర్త కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రకాష్‌రావు చైర్మన్‌గా నియమితులు కానున్నారు. పూసాలకు చెందిన ఉప్పెం గణేష్ వైస్ చైర్మన్‌గా ఖరారు చేశారు. ఇక్కడ చైర్మన్‌గా దన్నమనేని దామోదర్‌రావు పేరు ప్రధానంగా తెరపైకి వచ్చినప్పటికీ, ప్రకాష్‌రావు తనకే మార్కెట్ కమిటీ చైర్మ న్ పదవి కావాలని పట్టుబట్టడంతో ఆయన వైపు మొగ్గుచూపారు. దామోదర్‌రావుకు సైతం ఏదో ఒక పదవి దక్కనున్నది.



మినుపాల ప్రకాష్‌రావు, రామిడి తిరుపతిరెడ్డి

తెలుగు దేశం పార్టీ నుంచి విజయరమణారావు శిష్యుడిగా ఉంటున్న ఉప్పెం గణేష్ ఆయనే వెంటే ఉన్నప్పటికీ, 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు గణేష్ టీఆర్ఎస్‌లో చేరారు. గత ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరిన గణేష్ ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాలు పంచుకున్నారు. గణేష్ ముదిరాజ్ కుల సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆ వర్గానికి అవకాశం ఇచ్చి నట్లు అవుతుందని గణేష్‌కు వైస్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. కాల్వశ్రీరాంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మొదటి నుంచి ఊహిస్తున్నట్లుగా మీర్జంపేటకు చెందిన రామిడి తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్‌గా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన సబ్బని రాజమల్లు పేరును ఖరారు చేశారు. టీడీపీలో విజయరమణా రావు వెంట నడిచిన తిరుపతిరెడ్డి మధ్యలో టీఆర్ఎస్‌లో చేరారు.

ఆ తర్వాత రెండేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయన గెలుపు కోసం కృషి చేశారు. అలాగే మొదటి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్న రాజమల్లుకు కూడా సముచిత స్థానం కల్పిస్తూ వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. అధికారికంగా ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి.

## నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

**- రామగుండం కమిషనరేట్‌లో 11మంది అమరులు**

కోల్‌సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ధన, మానప్రాణ రక్షణకు ప్రాణాలను సైతం అర్పించే త్యాగ నిరతి పోలీసులది.. అమరజవాన్ల స్మారకంగా ఏటా అక్టోబరు 21ని పోలీస్ అమవీరుల సంస్మరణ దినం(ఫ్లాగ్ డే)గా జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీసులు ఈ రోజున అమరులకు ఘన నివాళులర్పిస్తారు.

**కమిషరేట్‌లో 11మంది అమరులు..**

రామగుండం కమిషనరేట్ పరిధిలో 11మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు. పెద్దపల్లి పట్టణంలో 1986 నవంబరు 6న జరిగిన కాల్పుల్లో డీఎస్పీ బుచ్చిరెడ్డి మరణించారు. 1985లో హోంగార్డు ఎర్రోజు స్వామిని పెద్దపల్లి పట్టణంలో నక్సలైట్లు చంపారు. 1996 మార్చి 4న పొత్కలపల్లి పోలీస్‌స్టేషన్‌ను పేల్చివేసిన ఘటనలో కానిస్టేబుల్ షేక్‌దాదె మరణించారు. 1996 జూలై 24న మంథని మండలం లక్కేపూర్‌లో కానిస్టేబుల్ రాములును నక్సలైట్లు హతమార్చగా 1999 మే 23న హోంగార్డు శంకరయ్యను మంథని ముత్తారంలో కాల్చిచంపారు. సీసీసీ నస్పూర్‌లో 1996 జూన్ 23న జరిగిన సికాస నాయకుడు రమాకాంత్ ఎన్‌కౌంటర్ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో సీఐ చక్రపాణి, కానిస్టేబుల్ అశోక్ మరణించారు. చెన్నూరులో హెడ్‌కానిస్టేబుల్ జహీరుద్దీన్‌ను 1989జనవరి 2న నక్సలైట్లు కాల్చి చంపారు. మంచిర్యాలకు చెందిన ఏఎస్ఐ మదన్ మోహన్‌ను ఇంటి వద్దనే నక్సలైట్లు కాల్చి చంపారు. బెల్లంపల్లి మార్కెట్‌లో హెడ్ కానిస్టేబుల్ జీ శేషయ్యను కాల్చి చంపగా, మరో హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డిని కూడా బెల్లంపల్లిలో నక్సలైట్లు కాల్చి చంపారు.



పోలీస్ అమరవీరుల స్థూపం

**అమరుల కుటుంబాలపై పట్టింపేది?**

విధి నిర్వహణలో అమరులైన పోలీస్ కుటుంబాలను ప్రతి సంవత్సరం కమిషనరేట్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పిలిచి గౌరవించడం సాంప్రదాయంగా వస్తోంది. అమరుల కుటుంబాలు తమ సమస్యలపై ప్రతి ఏడు గోడు వెల్లబుచ్చుతూనే ఉంటాయి. సమస్యలు పరిష్కరిస్తామని హామిలు ఇవ్వడం తప్పితే వాటిని పరిష్కరించిన పరిస్థితి లేదని అమరుల కుటుంబాలు మదన పడుతూనే ఉంటున్నాయి. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### శిథిలావస్థలో పోలీస్ అమరవీరుల స్మారక బస్టాండ్

● నిలువ నీడ లేక ప్రయాణికుల ఇబ్బందులు



కమాన్‌పూర్‌లో శిథిలావస్థకు చేరిన బస్టాండ్

కమాన్‌పూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కమాన్‌పూర్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన పోలీస్ అమరవీరుల బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రయాణికులకు బస్సుల కోసం వేచిచూసే సమయంలో నిలువ నీడ లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. 1990లో అప్పటి ఎస్సై వెంకటరమణ, పోలీస్ అమరుల స్మారకార్థం బస్టాండ్ గదిని ఏర్పాటుచేయగా ఎస్పీ సురేంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో ప్రయాణికుల ఇక్కట్లు తొలగిపోయాయి. కానీ కొన్ని సంవత్సరాలుగా ఈ బస్టాండ్ గది శిథిలావస్థకు చేరడం, కనీస సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా బస్టాండ్‌ను పోలీస్ సిబ్బంది లేదా అధికారులు మరమ్మతులు చేయించి ప్రయాణికులకు ఉపయోగపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

### సీఎంను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్



సీఎంను సన్మానిస్తున్న అంతటి అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన అంతటి అన్నయ్యగౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పుష్పగుచ్చం అందించి సన్మానించారు. అంతకుముందు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెంట రైస్‌మిల్లర్ల సంఘం నాయకుడు నగునూరి అశోక్‌కుమార్, సుల్తానాబాద్ మాజీ జడ్పీటీసీ మినుపాల స్వరూపప్రకాష్‌రావు, దుగ్యాల సంతోష్‌రావు, సాగర్ తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లాకు వచ్చిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్‌కు పెద్దపల్లి నియోజకవర్గ సరిహద్దు దుబ్బపల్లి వద్ద ఘన స్వాగతం పలికి బైక్ ర్యాలీగా సుల్తానాబాద్ చేరుకున్నారు.

### రామగుండంలో వీధి కుక్కల బెడదపై కార్పొరేషన్ దృష్టి

● యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు ప్రారంభం

కోల్‌సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో వీధి కుక్కల బెడద తీవ్రమవుతుండడంతో నగరపాలక సంస్థ కుక్కల సంఖ్య పెరుగుదల లేకుండా నియంత్రించే చర్యలపై దృష్టి పెట్టింది. కార్పొరేషన్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) అమలు చేయాలని నిర్ణయించింది. నాలుగేళ్ల క్రితం రామగుండంలో సేవలందించిన హైదరాబాద్‌కు చెందిన ఒక ఆర్గనైజేషన్‌కు పనులు అప్పగించారు. ఒక్కో వీధి కుక్కను పట్టుకుని బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేసి వ్యాక్సిన్ ఇచ్చి యథాస్థానంలో వదిలిపెడతారు. ఆదివారం సాయంత్రం నుంచి వీధి కుక్కలను పట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో వీధి కుక్కల నివారణకు గతంలో వాటిని చంపేవారు. వీధి కుక్కలను చంపవద్దని, వాటి సంఖ్య నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని జాతీయ జంతు సంరక్షణ బోర్డు మార్గదర్శకాలు జారీ చేసింది.

ఈ మేరకు మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఏబీసీ చర్యలు ప్రారంభించాలని అన్నీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఆదేశించింది. రామగుండంలో ఆలస్యంగానైనా ఈ చర్యలు ప్రారంభించారు.

# తెల్ల బంగారానికి c/o జమ్మికుంట మార్కెట్

**జమ్మికుంట..** వ్యాపార, వాణిజ్య కేంద్రంగా గుర్తింపు ఉన్న పట్టణం.. రైల్వే లైన్ ఉండడంతో ఈ పట్టణానికి ఎక్కడెక్కడి నుంచో వ్యాపారులు వచ్చి స్థిరపడ్డారు. సరుకు రవాణా సులభంగా అవుతుండడంతో ఈ మార్కెట్‌కు ఉత్తర తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. నిజాం హయాంలో 1944లో మార్కెట్‌ను ప్రారంభించారు. వందల్లో ప్రారంభమైన లావాదేవీలు ప్రస్తుతం కోట్ల రూపాయలకు చేరాయి. మార్కెట్ విస్తరణ పలు దశల్లో జరిగింది. .
దాన్యం, ఆపరాలతో ప్రారంభమైన మార్కెట్‌లో క్రమంగా పత్తి అమ్మకాలు ఊపందుకున్నాయి. ఇప్పుడు పత్తి అమ్మకాలకు కేరాఫ్‌గా మారిది. ఈ మార్కెట్‌ను నమ్ముకుని వెయ్యి మంది ఉపాధి పొందుతున్నారు.



జమ్మికుంట కొత్త మార్కెట్ ప్రధాన ముఖ ద్వారం

జమ్మికుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణకే తలమానికంగా నిలిచి రైతులు, వ్యాపారులు, కార్మికులు, కర్షకులు ఇలా ఎంతో మందికి ఉపాధిని కల్పించి జమ్మికుంట ప్రాంత అభివృద్ధిలో కీలకంగా నిలిచింది. వేలాది మంది కార్మికులకు ఉపాధి ఇవ్వడంతోపాటు వ్యాపారుల ఎదుగుదలకు తోడ్పాటును అందించింది. జమ్మికుంట అభివృద్ధికి వెన్ను దన్నుగా నిలిచిన వ్యవసాయ మార్కెట్ ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని నిలిచింది.

### 1944లో ప్రారంభం

జమ్మికుంట పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌ను 1944లో నెలకోల్పారు. 1950లో నిర్మించిన మార్కెట్ భవనాన్ని అప్పటి హైద్రాబాద్ సంస్థాన ప్రధానమంత్రి ఎంకే వెల్లోడి ప్రారంభించారు. మార్కెట్ యార్డు 9.32 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఆ సమయంలో ఆపరాలు, పల్లికాయ, ధాన్యం విక్రయాలు మాత్రమే జరిగేవి. పట్టణంలో నాలుగు ఆయిల్ మిల్లులు ఉండేవి. ఈ ప్రాంతంలో క్రమేణా పత్తి పంట సాగు పెరిగింది. మార్కెట్‌కు పత్తి రాక పెరగడంతో ధాన్యం, ఆపరాలకు చోటు సరిపోలేదు. దీంతో పత్తి విక్రయాల కోసం ప్రతేకంగా నూతన మార్కెట్ యార్డు నిర్మించాలని అప్పటి పాలకులు భావించారు. 2003లో కోట్లాది రూపాయాలు వెచ్చించి 16.28ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ యార్డు నిర్మించారు. అప్పటి మంత్రి ముద్దాసాని దామోదర్‌రెడ్డి మార్కెట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి పాత మార్కెట్ యార్డులో ధాన్యం, అపరాలు, కొత్త మార్కెట్ యార్డులో పత్తి విక్రయాలు సాగిస్తున్నారు.



### నాడు కనీసం రెండు రోజులు.. నేడు గంటల్లోనే..

జమ్మికుంట పట్టణంతో పాటు పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, కమలాపూర్, మొగుళ్లపల్లి, చిట్యాల, వీణవంక, హుజూరాబాద్, సైదాపూర్ ఇలా అనేక ప్రాంతాల నుండి ఎడ్ల బండ్లపై రైతులు అప్పట్లో తమ వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడకు తీసుకువచ్చే వారు. నిత్యం నలభై వేల వరకు పత్తి భస్తాలు విక్రయానికి వచ్చేవి. తెల్లవారు జామున తమ వ్యవసాయ ఉత్పత్తులతో మార్కెట్‌కు వచ్చిన రైతులు మరుసటి రోజు తెల్లవారు జాము వరకు అక్కడే ఉండేవారు. తూకాలు అయిపోగానే రసీదు పట్టుకోని అడ్తీదారు వద్దకు వెళ్లి డబ్బులు తీసుకుని ఇంటికి వెళ్లే సరికి రాత్రి అయ్యేది. వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకుని ఇంటికి చేరుకోవాలంటే రైతులకు కనీసం రెండు రోజుల సమయం పట్టేది. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతు తన సరుకులు విక్రయించుకోని గంటల వ్యవధిలోనే తిరిగి ఇంటికి చేరుకుంటున్నాడు. రవాణా సౌకర్యం మెరుగు పడడం, ఆన్‌లైన్ తూకాలు, ఆన్‌లైన్ పేమేంట్లతో రైతులకు అవస్థలు తప్పాయని చెప్పవచ్చు.

## 70 ఏళ్ల ఘన చరిత్ర

- ఏటా లక్షల క్వింటాళ్ల సరుకుల క్రయ విక్రయాలు
- వందల కోట్ల టర్నోవర్

### ప్రభుత్వానికి రూ. కోట్లలో ఆదాయం

జమ్మికుంట మార్కెట్లో ప్రతి ఏటా లక్షలాది క్వింటాళ్ల ధాన్యం, పత్తి విక్రయాలు జరుగుతుంటాయి. వందల కోట్ల టర్నోవర్ జరుగుతుంది. పత్తి, ధాన్యం కొనుగోళ్లపై వ్యాపారులు మార్కెట్‌కు ఒక శాతం మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్ పరిధిలో ఉన్న 17 గోదాములు అద్దెకు ఇవ్వడం ద్వారా ప్రతి ఏటా 40 లక్షలు, ట్రేడింగ్ లైసెన్స్‌ల రెన్యూవల్స్ కలిపి ప్రతి ఏటా ఆరు కోట్ల నుంచి ఏడు కోట్ల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. 2013లో 10 కోట్ల రూపాయల ఆదాయంతో ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. జమికుంట మార్కెట్‌తో ప్రత్యక్షంగా వెయ్యి మంది, వందల సంఖ్యలో పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. లైసెన్స్ ఉన్న వ్యాపారులు 72 మంది ఉన్నారు.

- **ఉద్యమాలకు కేంద్రం**

వ్యవసాయ ఉత్పత్తులను విక్రయానికి తీసుకు వచ్చే రైతులు ఉదయం 6గంటల లోపు యార్డుకు రావాల్సి ఉంటుంది. ఐదు నిమిషాలు ఆలస్యమైనా మార్కెట్ మెయిన్ గేట్ మూసేవారు. దీంతో కిలో మీటర్ల మేర వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయి ఉండేవి. మధ్యాహ్నం వరకు గేట్లు తీయని సందర్భాల్లో రైతులు తీవ్ర అసహనానికి లోనై నిరసనలు చేపట్టేవారు. వ్యాపారులు నాణ్యత పేరిటా పత్తి ధరల్లో అధిక తేడాలు వేసిన సందర్భాల్లో రైతులు ఆగ్రహావేశాలకు లోనయ్యేవారు. మెయిన్ గేట్‌కు తాళం వేసి, కార్యాలయంలో అధికారులను నిర్బంధించేవారు. పలు మార్లు మార్కెట్ ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఘటనల్లో రైతులపై కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ధాన్యం కోసం గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా, కొత్త మార్కెట్లు ఏర్పాటయినా జమ్మికుంట మార్కెట్ తన ప్రత్యేకతను చాటుకుంటుంది.


మార్కెట్‌కు వచ్చిన పత్తి (ఫైల్)

## క్రైం కార్నర్

### కృష్ణా నదిలో మునిగి యువకుడి మృతి

**- సీతంపేటలో విషాదం**


వేణుగోపాల్(ఫైల్)

ఇల్లందకుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు దైవ దర్శనానికి వెళ్లి కృష్ణా నదిలో మునిగి మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. గ్రామస్థులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేట గ్రామానికి చెందిన పోతన రాజేంద్రం-సరస్వతి దంపతుల కుమారుడు వేణుగోపాల్(38) ఈ నెల 17న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాలోని దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడానికి వెళ్లాడు. అక్కడే ఉన్న కృష్ణా నదిలో స్నానం చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి మునిగిపోయాడు. రెండు రోజులుగా నది పక్కనే బ్యాగ్ ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు గాలింపు చేపట్టగా సంఘటన స్థలం నుంచి 40 కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభించింది. అతడి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

### మున్సిపల్ మాజీ చైర్మన్ బ్యాగు చోరీ

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్ రాజయ్య బ్యాగు శనివారం రాత్రి చోరీకి గురైంది. హైదరాబాద్ నుంచి పెద్దపల్లికి వచ్చిన రాజయ్య కమాన్ వద్ద బస్సు దిగి ఎదురు చూస్తుండగా, ఆటోలో ముగ్గురు వ్యక్తులు వచ్చి రాజయ్య చేతిలో ఉన్న బ్యాగు లాక్కెళ్లారు. ఇంతలో రాజయ్యను పికప్ చేసుకునే వ్యక్తి రాగానే దుండగులు వెళ్లిన దారిని వెంబడించారు. క్రిసెంట్ స్కూల్ వద్ద ఆటోను పట్టుకోగా ఆటోలో ఉన్న వ్యక్తులు పారిపోయారు. బ్యాగులో భూములకు సంబంధించి డాక్యుమెంట్లు ఉన్నాయని, నగదు లేదని తెలిపారు. పోలీసులు ఆటోను పోలీస్‌స్టేషన్లో ఉంచారు. పట్టణానికి చెందిన డ్రైవర్ రెహాన్ ఆదివారం పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేసుకుంటానని హంగామా చేశాడు. తన ఆటోను ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై లక్ష్మణ్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### ఇంట్లో ఉన్న బంగారం మాయం

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో దాచిన బంగారం చోరీకి గురయ్యింది. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మల్లేష్ భార్య శ్యామల దసరా పండుగ సందర్భంగా ఆభరణాలు ధరించి తర్వాత దాచిపెట్టింది. గురువారం తెరిచి చూడగా మొత్తం ఆరు తులాల బంగారం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. అయితే బాధితులు ఓ మహిళపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఏడు గొర్రెలు మృతి

**- గొర్రెల కాపరికి గాయాలు**

మానకొండూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి గొర్రెలను కారు ఢీకొన్న ప్రమాదంలో ఏడు గొర్రెలు మృతి చెందాయి. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లాకు చెందిన సంచార జీవి సాయిలు గొర్రెలను పచ్చునూర్ వైపు నుంచి లలితాపూర్ వైపు తరలిస్తున్నాడు. ఆ సమయంలో మానకొండూర్ నుంచి జమ్మికుంట వైపు వెళుతున్న కారు లలితాపూర్ గ్రామ శివారులో గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల కాపరి సాయిలుకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ సాయిలును కరీంనగర్‌కు తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

### గంజాయి సేవిస్తున్న ఇద్దరి పట్టివేత



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గంగానగర్ మిలీనియం క్వార్టర్స్ సమీపంలో గంజాయి సేవిస్తున్న మార్కండేయకాలనీకి చెందిన అక్రమ్, ఆసీఫ్‌లను పట్టుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి 80గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లు సీజ్ చేశామన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు. గోదావరిఖని పట్టణంలో గంజాయి, డ్రగ్స్ లేకుండా చేయలనే ఉద్దేశంతో మూడు కేసుల్లో 16 కిలోల గంజాయిని పట్టుకోవడమే కాకుండా 24 మందిని అరెస్టు చేశామన్నారు. మరో 43 మందిని కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని సీఐ పేర్కొన్నారు.

### విద్యుదాఘాతంతో ఏఎల్ఎంకు గాయాలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేగుర్తిలో ఆదివారం విద్యుదాఘాతంతో ఏఎల్ఎంకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చేగుర్తిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజ్ పనిచేయడం లేదనే రైతుల సమాచారం మేరకు ఏఎల్ఎంలు శ్రీకాంత్, అమర్‌లు అక్కడికి వెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా చేసే ఏబీ స్విచ్ఛాఫ్ చేయాల్సిందిగా ఏఎల్ఎం అమర్‌కు శ్రీకాంత్ చెప్పాడు. అమర్ ఏబీ స్విచ్ఛాఫ్ చేయకముందే శ్రీకాంత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కేందుకు ప్రయత్నించగా విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. రైతులు వెంటనే చికిత్సకోసం ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్‌ను ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వి గంగాధర్, డీఈ రాజం, ఏడీఈ రఘు, బొమ్మకల్ ఏడీ అనిల్‌కుమార్ పరామర్శించారు. చాతిపై చర్మం కాలిపోయిందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

### ఎల్ఎండీలో పడి యువకుడి మృతి


సాయికుమార్(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యువకుడు దిగువ మానేరు జలాశయంలో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. యువకుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బూర సాయికుమార్(29) హైదారాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు శనివారం సాయంత్రం ఇంటికి వస్తున్నట్లు తండ్రికి ఫోన్‌చేసి చెప్పిన సాయికుమార్ రాత్రి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం మహాత్మానగర్‌లోని శ్రీతాపాల నరసింహ స్వామి ఆలయం సమీపంలో దిగువ మానేరు జలాశయంలో సాయికుమార్ మృతదేహం ఉన్నట్లు తండ్రికి సమాచారం అందింది. అప్పటికే సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై వివేక్, బ్లూకోల్ట్స్ సిబ్బంది నరేష్, లక్ష్మీనారాయణ మత్స్యకారుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం సాయికుమార్‌దిగా గుర్తించారు. శనివారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన సాయికు మార్ నీటిలో పడి మృతి చెందాడని తండ్రి కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

## వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

**ఉమ్మడి జిల్లాలోని వీణవంక, పాలకుర్తి, ఇల్లందకుంట మండలాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వీణవంక మండలం ఇప్పలపల్లిలో జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ, పాలకుర్తి మండలం పుట్నూర్‌లో మనోవేదనతో వివాహిత, ఇల్లందకుంట మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.**

- అనారోగ్యంతో బాధపడుతూ..

వీణవంక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలం ఇప్పలపల్లి గ్రామంలో ఉరివేసుకుని ఓ మహిళా ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గువ్వల సంగీత(33) చొప్పదండిలోని ఇరిగేషన్ డిపార్ట్ మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. పదేళ్ల క్రితం సంగీత భర్త కొండయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అనంతరం కూతురు కిరణ్మయితో పాటు సంగీత తన తల్లిగారి ఊరు ఇప్పలపల్లిలో ఉంటోంది. రెండునెలలుగా సంగీత అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం అర్ధరాత్రి ఇంట్లోని పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు సంగీత తల్లి ఆకునూరి మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

- మనోవేదనకు గురై..


చెలిమేటి సంధ్య(ఫైల్)

**పాలకుర్తి (ఆంధ్రజ్యోతి):** బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుట్నూర్‌లో ఆదివారం ఉదయం ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పుట్నూర్ గ్రామానికి చెందిన చెలిమేటి సంధ్య(32) అనే వివాహిత సంవత్సరం నుంచి ఫిట్స్, మానసిక వ్యా ధి తో బాధపడుతోంది. వైద్యం చేయించుకున్నా వ్యాధి తగ్గకపోవడంతో మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని చనిపోయింది. మృతురాలు సంధ్య అన్న ముడిమడుగుల రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త సత్యనారాయణ, కూతురు వాసవి ఉన్నారు.

బావిలో దూకి వృద్ధురాలు..

**ఇల్లందకుంట (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధురాలు శనివారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కనుమల్ల భూమమ్మ(82) రెండేళ్ల క్రితం కాలు జారి కింద పడగా తొంటి విరిగింది. కొంత మేర నయమైనప్పటికీ నొప్పితో అవస్థలు పడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి ఇల్లందకుంట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భూమమ్మ బంధువు సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

## ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

**-సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి**

**-ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్ల ఎంపికకు విశేష స్పందన**

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. సుడా చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి జిల్లాకు ఒక క్రీడా పాఠశాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు.

ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 375 మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా ఖో-ఖో పోటీలను నిర్వహించి ప్రతిభచాటిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖో-ఖో సంఘ సభ్యులు వంగపల్లి సూర్యప్రకాశ్, సీఐ కుమారస్వామి, కట్ట సంతోష్, ఎస్‌కే మొయినుద్దీన్, శివకుమార్, గెల్లు మధుకర్, సంధ్య, కరుణాకర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఖో-ఖో సంఘం ప్రతినిధులు

## మారుమూల పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి..

- క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న ఇదిలాపూర్ యువకుడు
- డొమెస్టిక్ క్రికెట్ క్లబ్ లెవెల్‌లో ఎంపికైన సాహిత్ కుమార్


తల్లిదండ్రులతో బాల్త సాహిత్ కుమార్



కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇదిలాపూర్‌కు చెందిన బాల్త సాహిత్ కుమార్ డొమెస్టిక్ క్రికెట్ క్లబ్ లెవెల్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు.. శ్రీలంకలో జరిగే అండర్-19 క్రికెట్ పోటీలకు బాల్త సాహిత్ కుమార్ ఈనెల 26న కొలంబోలో జరిగే అంతర్జాతీయ క్లబ్ పోటీల్లో ఆల్ రౌండర్‌గా ఆడనున్నాడు. సాహిత్ కుమార్ తండ్రి గ్రామంలో వ్యవసాయంతో పాటు చిన్న హోటల్ నడిపిస్తున్నాడు. యూకేజీ నుంచి పదో తరగతి వరకు ముత్తారం గ్రామంలోని శ్రీ సరస్వతి విద్యాలయంలో చదివాడు. ఇంటర్మీడియెట్ హన్మకొండ లాల్ బహదూర్ కాలేజీలో పూర్తిచేసి, హైదరాబాదులో లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్‌లో డిగ్రీ చదువుతున్నాడు. సాహిత్ కుమార్‌కు క్రికెట్‌పై ఆసక్తిని గుర్తించిన తండ్రి రవీందర్ హైదరాబాదులోని నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీలో కోచింగ్‌లో చేర్పించాడు. కోచింగ్ తీసుకుంటూనే పూణే, బెంగళూరు, చెన్నై, టి20, వన్ డే క్రికెట్ మ్యాచ్‌ల్లో పాల్గొని తన సత్తా చాటుకున్నాడు. దీంతో నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీ శ్రీలంకలోని కొలంబోలో జరిగే ఇంటర్నేషనల్ అండర్-19 డొమెస్టిక్ క్లబ్ లెవెల్ క్రికెట్ పోటీలకు సాహిత్ కుమార్‌ను ఎంపిక చేసింది. ఈనెల 26 నుంచి 29 వరకు జరగనున్న పోటీలకు సాహిత్ కుమార్ హాజరుకానున్నాడు. మారుమూల గ్రామం నుంచి ఇంటర్నేషనల్ పోటీలకు సాహిత్ కుమార్ ఎంపిక కావడంతో ఇదిలాపూర్ గ్రామంతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అంతర్జాతీయ క్రికెటర్ గా ఎదగాలని నా కోరిక

- బాల్త సాహిత్ కుమార్

అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదగాలని నా కోరిక. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాను. హైదరాబాద్ నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీలో కోచింగ్ తీసుకుంటూ చెన్నై, పూణే, బెంగళూరులో జరిగిన పోటీల్లో ఆల్ రౌండర్‌గా పాల్గొని బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చానని, నా ప్రతిభను చూసి నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీ అండర్ 19 విభాగంలో శ్రీలంకలోని కొలంబోలో జరుగనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ పోటీలకు ఎంపిక చేసింది. మా నాన్న రవీందర్ వ్యవసాయంతో పాటు హోటల్ నడుపుకుంటూ క్రికెట్‌లో నాకు ప్రోత్సాహం అందిస్తున్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

- గోదావరిఖని ఏసీపీ రమేష్
- ఉమ్మడి జిల్లాస్థాయి కరాటే టోర్నమెంట్ ప్రారంభం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ మడత రమేష్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. ఆదివారం గోదావరిఖని ఆర్‌సీఓఏ క్లబ్‌లో స్పోర్ట్స్ కరాటే హెడ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా 68వ స్కూల్ గేమ్స్ జోనల్ లెవల్ కరాటే టోర్నమెంట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పిల్లలు చిన్న నాటి నుంచే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో జ్ఞానం పెరగడంతో పాటు శారీరధారుఢ్యం పెరుగుతుందని, పైచదువులకు వెళ్లేటప్పుడు క్రీడలు ఉపయోగపడుతాయన్నారు. చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు క్రీడా సర్టిఫికెట్ల కోటాలో సీట్లు సాధిస్తున్నారని, అంతేకాకుండా ఉద్యోగాల్లో కూడా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా వస్తున్నాయని ఆయన వివరించారు. గోదావరిఖనిలో కరాటే పోటీలు నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను ఏసీపీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, తగరపు శంకర్, రాజిరెడ్డి, పసునూటి శంకర్, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

● రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు అండర్-14 బాలికల విభాగంలో మనస్విని, అద్విత, శ్రీవర్షిణి, సహస్ర, శృశిత, సహస్ర, శాన్వి, ముక్తశ్రీ, శ్రీనిధి, సహస్ర, సుల్తానా, అండర్-14 బాలుర విభాగంలో మణిదీప్, శ్రీరాజ్, సాయి, కుర్షిద్, చౌహాన్, విశ్వక్‌సేన్, రిశ్వంత్, అబ్దుల్ ముజీబ్, రిషికేష్, సూర్య ప్రభాస్ ఎంపికయ్యారు.

## 'కాలనీ'లో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగింది. అండర్-14 బాలుర విభాగంలో పెద్దపల్లి జట్టు కరీంనగర్ జట్టుపై విజయం సాధించి ట్రోఫీ గెలుపొందింది. బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు పెద్దపల్లి జట్టుపై గెలిచింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా, జగిత్యాల బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జక్కుల దామోదర్‌రావు హాజరయ్యారు. స్పందన మోడల్ స్కూల్ నిర్వహించిన ఈ పోటీలకు వివిధ జిల్లాల పాఠశాలల పీఈటీలు, ట్రస్మా సభ్యులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

వేములవాడ నాంపల్లి గుట్ట వద్ద ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడి ప్రకృతి రమణీయత భక్తులు, సందర్శకులను ఆకట్టుకుంటుంది. చుట్టూ పచ్చని పొలాలు.. మూలవాగు, మానేరు వాగుల ప్రవాహం.. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తాయి. ప్రధానంగా గుట్ట మధ్య భాగంలో కాళీయమర్ధనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.


నాంపల్లి గుట్టపైన ఏర్పాటు చేసిన కాళీయమర్ధనం


వేములవాడ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. గుట్టపైన మూడు నామాల రూపంలో లక్ష్మీనృసింహస్వామి ప్రతిమ వెలిసింది. ఆ ప్రతిమకు కుడివైపున హనుమంతుడి ప్రతిమ ఉంటుంది. చోళుల కాలం నుంచి స్వామివారికి పూజలు జరుగుతున్నట్లు ఆధారాలు చెబుతు న్నాయి. ఇక్కడి ప్రకృతి రమణీయత భక్తులకు ఆహ్లాదం పంచుతుంది. గుట్ట చుట్టూ పచ్చటి పంటపొలాలు, మూలవాగు, మానేరు వాగుల ప్రవాహం.. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తాయి.

● గుట్టపై కాళీయమర్ధనం

నాంపల్లి గుట్టపైకి వెళ్లే మార్గంలో మధ్య భాగాన 2003లో చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు కాళీయమర్ధనాన్ని నిర్మించారు. కాళీయమర్ధనం లోపలికి వెళ్లే మార్గంలో శ్రీకృష్ణుడి లీలలకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాళీయమర్ధనం లోపల ఉగ్రనృసింహస్వామి విగ్రహంతోపాటు నాగదేవత విగ్రహాలు ఉన్నాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని నాగ

- నాంపల్లి గుట్టపై లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం
- ప్రకృతి రమణీయంగా ఆలయ పరిసరాలు
- ప్రత్యేక ఆకర్షణగా కాళీయమర్ధనం

దేవతకు పాలతో అభిషేకం నిర్వహిస్తారు. నాంపల్లి గుట్టపైన రెండు ధర్మగుండాలు ఉన్నాయి. గుట్ట బండరాళ్ల చౌరకళ్లో ఉన్న ధర్మగుండం సుమారు వెయ్యి ఏళ్ల క్రితం శ్రీరాజరాజేంద్రుడు కట్టించినట్లు స్థానికులు చెబుతారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి తడిబట్టలతో లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకునేవారు. నాంపల్లి గుట్టపైన గోపురం పక్కన సహజ సిద్ధంగా ఏర్పడిన బండరాళ్ల మధ్య ఒక శివలింగంతోపాటు పలు విగ్రహాలు ఉన్నాయి.


నాంపల్లి గుట్ట పైనుంచి కనువిందు చేస్తున్న మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ వ్యూ

● పార్శ్వనాథుడు, హన్మంతుని ప్రతిమలు

నవనాథ సిద్ధులు (తొమ్మిది మంది) ఈ గుట్టపై తపస్సు చేసి సిద్ధి పొందారని, నిత్యం నవనాథ సిద్ధ మహర్షులు ఈ గుహలో నుంచి భూగర్భ మార్గంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామిని చేరుకొని పూజలు చేసేవారు. అందులో 12వ శతాబ్దానికి సంబంధించిన జైనమతానికి చెందిన పార్శ్వనాథుని ప్రతిమ బండరాయిపై కనిపిస్తుంది. ఇలాంటి ప్రతిమలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. గుట్టకు నాలుగు వైపుల పెద్ద పెద్ద బండరాళ్లకు హనుమంతుని ప్రతిమలు కనిపిస్తాయి.

### వీటీడీఏ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు



నాంపల్లి గుట్టను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం వీటీడీఏ (వేములవాడ ఆలయ ప్రాంత అభివృద్ధి ప్రాధికర సంస్థ) ఆధ్వర్యంలో నాంపల్లి గుట్ట అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఊహచిత్రాలు విడుదల చేసింది. నాంపల్లి గుట్ట సుమారుగా 52 అడుగుల ఎత్తుతో కొంతభాగం నిటారుగా ఉంటుంది. దీంతో నాంపల్లి గుట్టపైకి రోప్‌వే నిర్మాణం, ప్రొటెక్షన్ వాల్‌తో మరో ఘాట్ రోడ్డు, ధర్మగుండాల సుందరీకరణ, వసతిగృహాల నిర్మాణం, గుట్టపైన ధ్యానమందిరం, ప్లానిటోరియం, గుట్ట చుట్టూ ప్రకృతి అందాలను భక్తులు వీక్షించేందుకు గుట్టపైన పనోరమా వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసేందుకు ఊహచిత్రాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం చొరవ తీసుకొని నాంపల్లి గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని భక్తులు, సందర్శకులు కోరుతున్నారు.

# వీధి కుక్కల స్వైరవిహారం

- హడలిపోతున్న ప్రజలు


రుద్రంగి ప్రధాన రహదారిపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

రుద్రంగి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో వీధికుక్కలు యధేచ్ఛగా స్వైర్యవిహారం చేస్తున్నాయి. రుద్రంగిలోని ఒక ప్రాంతం అని కాకుండా ఎక్కడ చూసినా దర్శనమిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. కుక్కల బెడద విపరీతంగా పెరగడంతో చిన్నారులతో పాటు పెద్దవారు భయాందోళనకు గురవుతున్నారు. నెలల తరబడి కుక్కల సమస్య వెంటాడుతున్నప్పటికీ పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. చికెన్ సెంటర్లు, ఫ్రై సెంటర్లు వాటికి సంబంధించిన వ్యర్థాలను రోడ్లపై పాడేయడంతో వీధి కుక్కల సంఖ్య భారీగా పెరిగిపోయింది. రాత్రివేళలో వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై ద్వీచక్ర వాహనలపై వెళ్లే వాహనదారులపై కుక్కలు వెంట పడటంతో చాలా మంది ప్రమాదాలకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఇటీవల ఇందిరాచౌక్‌లో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిపై కుక్కల గుంపు వెంట పడటంతో కాలు విరిగింది.

కొన్ని ప్రాంతాల్లో పిచ్చికుక్కలు చిన్నారులపై దాడి చేస్తున్నాయి. కుక్కలు గుంపులు గుంపులుగా తిరగడంతో పాఠశాల నుంచి వచ్చే విద్యార్థుల వెంటపడడంతో భయాందోళనకు గురవుతున్నారు. దీంతో చిన్నారులు అరుపులు వేయడంతో కుక్కలను తరిమేందుకు స్థానికులు కర్రలు పట్టుకుని తరమడంతో అవి పారిపోయాయి అని గ్రామస్థులు తెలిపారు. పిచ్చికుక్కలు తిరగడంతో చిన్నారుల ను బయటకు పంపేందుకు ఆందోళనకు గురికావాల్సి వస్తోందని స్థానికులు తెలుపుతున్నారు. అధికారులు కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలని కోరుతున్నారు. గ్రామంలో కుక్కలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## అంజన్న సన్నిధిలో భక్తుల సందడి


అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారాంతపు సెలవుదినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్ తదితరులు పర్యవేక్షించారు.

## పశువులపై హైనా దాడులు

- ఆందోళనలో రైతులు



చిగురుమామిడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుమామిడి, సుందరగిరి, నవాబుపేట, ముదిమాణిక్యం, గాగిరెడ్డిపల్లి, ఉల్లంపల్లి తదితర గ్రామాల్లో ఇటీవల పశువులపై హైనా దాడులు చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలి కాలంలో చిగురుమామిడి, నవాబుపేట గ్రామాల్లో హైనా దాడిలో పశువులు మృతి చెందాయి.

అధికారులు సంఘటన జరిగిన సందర్భంలోనే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారని, అనంతరం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పశువులు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపో తున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**పరిహారం అందజేయాలి..**
- ఎలగందుల రాజు, రైతు సుందరగిరి

మండలంలో హైనా దాడులు చేసి పశువులను హతమార్చుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. బాధిత రైతులకు పరిహారం కూడా అందడం లేదు. అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించాలి. హైనా దాడిలో పశువులు మృతి చెందిన రైతులకు పరిహారం అందజేయాలి.

## విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

-ఎస్ఈ గంగాధర్

కరీంనగర్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అండర్ గ్రౌండ్ కేబుల్ తెగిపోవడంతో నాలుగు గ్రామాలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో రైల్వే కేబుల్ తవ్వుతుండగా కరెంటు వైర్లు కట్ అనే శీర్షికన వచ్చిన కథనానికి ఎస్ఈ స్పందించారు. చేగుర్తిలో ఏఎల్ఎం శ్రీకాంత్ విద్యుదాఘాతంతో గాయపడటంతో ఎస్ఈ గంగాధర్ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గుంటూరుపల్లి వద్ద తెగిపోయిన అండర్ గ్రౌండ్ కేబుల్‌ను తనిఖీ చేశారు. కేబుల్ మరమ్మతు పనులను పూర్తి చేసి సోమవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ఎస్ఈ వెంట ఏడీ రాజాం, ఏడీఈ రఘు, ఏఈ అనిల్ కుమార్‌లు ఉన్నారు.

## ఘనంగా సంకటహర చతుర్థి పూజలు


స్వామి వారలకు హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, స్థానిక వేదపండితులు మదు రామశర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య లోక కళ్యాణార్థం శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరో హితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, అర్చకులు సాయికుమార్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, పాల్గొన్నారు.

# నీరు ఎత్తి పోసేదెప్పుడో..?

- నిరుపయోగంగా కొత్తపేట ఎత్తిపోతల పథకం
- 262 ఎకరాలకు సాగునీరు
- వినియోగంలోకి తీసుకురావాలని రైతుల వేడుకోలు


కొత్తపేటలోని ఎత్తిపోతల పథకం

రాయికల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాయికల్ మండలం కొత్తపేటలో భూములను సస్యశ్యామలం చేసేందుకు 2003-04 సంవత్సరంలో రూ.26 లక్షల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉండటంతో యంత్రాలన్నీ తుప్పు పట్టిపోయాయి. దీంతో ఎత్తిపోతల ద్వారా వ్యవసాయం చేయలేక రైతులు బావులపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రాయికల్ మండలం కొత్తపేటలో రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ఎమ్మెల్యే జువ్వాడి రత్నాకర్‌రావు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. గ్రామంలో 262 ఎకరాలు ఎత్తిపోతల పథకం ద్వారా సాగయ్యేవి. ఈ పథకం పనిచేయకపోవడంతో రైతులకు సరిపడా సాగునీరు లేకపోవడంతో మామిడి పంటలపై దృష్టి సారించారు. ఈ గ్రామంలో ఎస్సారెస్పీ నీరుసైతం సరిగా రాకపోవడంతో కేవలం వ్యవసాయ బావులపైనే ఆధారపడి రైతులు వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని బీఆర్ఎస్ హయాంలో మంత్రులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు స్పందించి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

**ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి..**
మాదం రమేష్, కొత్తపేట



గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి. మా గ్రామంలోని 262 ఎకరాల భూమి సస్యశ్యామలం అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతలు ప్రారంభించాలి.

**యంత్రాలు పని చేయడం లేదు..**
బత్తిని రాజేశం, తాజా మాజీ సర్పంచ్



మా గ్రామంలోని ఎత్తిపోతల పథకం యంత్రాలన్నీ తుప్పు పట్టాయి. సాగునీటి కోసం జువ్వాడి రత్నాకర్ రావు హయాంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయగా, దీనిని పట్టించుకునే నాథుడే లేడు. మా గ్రామంలో ఎస్సారెస్పీ నీరు కూడా సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఎత్తిపోతల పథకాన్ని పునః ప్రారంభించాలి.

## జాతీయస్థాయిలో పతకాలు సాధించాలి

-రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యోగాసన పోటీల్లో పతకాలు సాధించాలని తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. ఆదివారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన జిల్లా యోగా క్రీడాకారులకు జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ యోగా క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందించి అభినందించారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 28 వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ఊనాలో జరిగే జాతీయ యోగాసన చాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. జాతీయస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. 8-10 సంవత్సరాల విభగంలో డి కృపా సూరజ్, 10-12 విభాగంలో బి సాకేత్, ఎన్ ఆదిత్య, 12-14 విభాగంలో పి దీపక్, టి హర్షిత్, బాలాజీ, 14-16 విభగంలో బి ఇందుప్రియ, 16-18 విభాగంలో పి అభికుమార్ జాతీయ పోటీల్లో పాల్గొననున్నారని జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి ఎన్ సిద్ధారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్రీడా పాఠశాల యోగా కోచ్ వి కిష్టయ్య, ఆనంద్, కుమార్, కోటేశ్వర్‌రావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## తమ్ముడి చేతిలో అన్న హతం

ఆస్తి తగాదాలే కారణం


సాయిలు(ఫైల్)

మల్లాపూర్, అక్టోబరు, 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఆస్తి కోసం సొంత అన్ననే తమ్ముడు హతమార్చిన ఘటన ఆదివారం కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒబులాపూర్ గ్రామానికి చెందిన పల్లపు సాయిలు(34)ను తన తమ్ముడు చంద్రి ఆదివారం హత్య చేశాడు. సాయిలు కొన్నేళ్లుగా ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లి ఆరు నెలల క్రితమే స్వగ్రామానికి చేరుకున్నాడు. తల్లిదండ్రులు ఆస్తి పంపకాలు చేయకపోవడంతో ఇంటి సమీపంలో నడక దారి విషయంలో అన్నదమ్ములిద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. దీంతో అన్న సాయిలుపై తమ్ముడు చంద్రి కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సాయిలు బయటకు వెళ్లటాన్ని గమనించిన తమ్ముడు ఇంట్లో నుంచి కత్తి తీసుకుని అతడి వెనకాలే వెళ్లాడు. కొద్ది దూరం వెళ్లాక కత్తిలో సాయిలు తల నరికి అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## న్యూస్ బాక్స్

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కమాన్‌పూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కొట్టె ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత మత్తు భారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఫోన్‌లలో వస్తున్న గుర్తు తెలియని లింకులను క్లిక్ చేసి మోసాల భారిన పడవద్దన్నారు. చెడు వ్యసనాలకు దూరం గా ఉండాలన్నారు. ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు ఎదగాలన్నారు.

### కార్యవర్గం ఎన్నిక

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 20(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా వాటర్ ప్యూరిఫైడ్ సేల్స్ అండ్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికయ్యింది. జిల్లా అధ్యక్షుడిగా తోడేటి శంకర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షుడిగా తొవిటి శ్రీధర్, మంతెన శేఖర్, ప్రధానకార్యదర్శిగా పేరాల రవి, సంయుక్తకార్యదర్శిగా సోమారపు రాజశేఖర్, కోశాధికారిగా ఆరెపల్లి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా దాడి శ్యామ్‌కుమార్, రాతి సురేందర్, బి.కుమార్, రాయిశెట్టి శివకుమార్, మామిడి కిరణ్‌కుమార్, సుంకరి రమేష్, సందీప్ ఎన్నికయ్యారు.

### వృద్ధులకు చీరల పంపిణీ

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ దయానంద్ గాంధీ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. రెయిన్ బో పాఠశాల కరస్పాండెంట్ పీఎస్ అమరేందర్, కళాకారుడు దామర శంకర్, డ్యాన్స్ మాస్టర్ సర్వేష్ పాల్గొన్నారు.

### గీత కార్మికుడికి గాయాలు

కమాన్‌పూర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గర్రెపల్లి వెంకటేష్ ఆదివారం తాటి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. దీంతో నడుము, చేయికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి వెంకటేష్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు వెంగలి రాజయ్య, పొన్నం వెంకన్న, శ్రీనివాస్ గౌడ్ తదితరులు కోరారు.

# కళా భవన్ నిర్మాణానికి మోక్షమెప్పుడో?

● మూడు దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని ఆడిటోరియం ● ప్రకటనలకే పరిమితమవుతున్న నేతల హామీలు



గోదావరిఖనిలో కళాభవన్ నిర్మాణానికి కేటాయించిన స్థలం



ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు(ఫైల్)

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): కళలు, కళాకారులు, కళా చైతన్యానికి పురిటిగడ్డ గోదావరిఖని కార్మిక క్షేత్రం. ఎన్నో ఉద్యమాల్లో తమ ఆటపాటలతో చైతన్యాన్ని నింపిన కళాకారులకు పారిశ్రామిక ప్రాంతంలో తగిన గుర్తింపు లేకుండా పోతున్నది. గజ్జె కట్టి.. గొంతు విప్పి తన ఆటపాటలతో ఊపిరులూది సభలు, సమావేశాలను ఉత్తేజంతో ఉరకలెత్తించిన కళాకారులు మూడు దశాబ్దాలుగా కళా భవన్ కోసం చేస్తున్న విజ్ఞప్తి పట్టించుకునే వారే కరువయ్యారు.. గోదావరిఖనిలో కళాభవన్ నిర్మాణం కలగానే మిలిగిపోతున్నది. మూడు దశాబ్దాలుగా కళా భవన్ నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఉమ్మడి సమైక్యాంధ్రలో మేడారం నియోజకవర్గం నుంచి ప్రస్తుత తెలంగాణలో రామగుండం నియోజకవర్గం వరకు కళా భవన్ కల నేరవేరడం లేదు. హనుమాన్‌నగర్‌లోని యూపీఎస్ పాఠశాల ఆవరణలోని సర్వేనంబర్ 690లో 32 గుంటల భూమిని కళా భవన్ కోసం కేటాయించారు. అందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. కాగా 2018లో రూ.4కోట్లతో ఆధునాతన ఆడిటోరియం నిర్మించేందుకు ప్రతిపాదించింది. అందుకు ఆర్ అండ్‌బీ ఆధ్వర్యంలో టెండర్ పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ 2019 ఫిబ్రవరి 21న కళాభవన్ నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో భూమి పూజ చేయించారు. అయితే కాంట్రాక్టర్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో పనులు నిలిచిపోయాయి. అయితే పెరిగిన రేట్లతో పాత టెండర్ కొటేషన్‌కు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్ల నేటికి కళాభవన్ నిర్మాణానికి నోచులేదు.

### ● కార్యక్రమాలకు దూరం

కళాభవన్ లేక పోవడం వల్ల పారిశ్రామిక ప్రాంతంలో కళోత్సవాల నిర్వహణలు, ఇతరత్రా కార్యక్రమాలకు నిర్వహణ భారం అవుతున్నాయి. సుమారు 45 కళా సంఘాలు, 300లకు పైగా కళాకారులు ఉన్న ఈ ప్రాంతంలో వివిధ స్థాయిలో బహుమతులు అందుకున్నారు. ఎన్నో కళారూపాలతో అలరించిన కళాకారులకు కనీసం సాధ న చేసేందుకు గానీ శిక్షణ తీసుకునేందుకు కూడా వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కళా భవన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కళాకారులు కోరుతున్నారు.

### కళాకారులను ప్రోత్సహించాలి..

- కనకం రమణయ్య, అధ్యక్షుడు, గోదావరి కళా సంఘాల సమాఖ్య



గోదావరిఖనిలో కళాభ వన్ లేక కళాకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యక్రమాలు నిర్వహించలేక, ఇతర హాల్స్‌లో నిర్వహించే స్థోమత లేక కళోత్సవాలు భారంగా మారుతున్నాయి. దీంతో కళలు, కళాకారులకు ప్రోత్సాహం లేక మూగబోయే పరిస్థితి నెలకొంది. కళాభవన్ నిర్మాణం కోసం మూడు దశాబ్దాలుగా ప్రయత్నాలు చేస్తున్నాం. కనీసం ఈ ప్రజాప్రభుత్వంలోనైనా కళాభవన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

### ఆడిటోరియం లేక ఇబ్బందులు..

- మేజిక్ రాజా, సీనియర్ కళాకారుడు



కళాభవన్ మూడుదశాబ్దాల కల. జాతీయస్థాయిలో రాణిస్తున్న కళాకారులు, సినీనటులు ఉన్నప్పటికి కళా సాధన చేసేందుకు, ప్రదర్శించేందుకు సరైన వేదిక లేదు. వేదికల కోసం ప్రైవేట్ పాఠశాలలు, ఫంక్షన్ హాల్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎంతో మంది ఎమ్మెల్యేలకు కళాకారులు వినతిపత్రాలు ఇచ్చినా, నిధులు వచ్చినా నిర్మాణానికి అడుగు ముందుకు పడడం లేదు. ఈ ప్రభుత్వంలోనైనా కళాభవన్ నిర్మాణానికి కృషి చేయాలి.

### మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ వచ్చే 5,6 తేదీలలో ఇందిరా పార్కు వద్ద జరిగే 24 గంటల దీక్షలు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలు విడుదల చేయాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే నవంబర్ 24 గంటల దీక్షకు పెద్ద ఎత్తున జనం హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా వర్కింగ్ అధ్యక్షులు సిపెల్లి రవీందర్ జిల్లా కార్యదర్శి ఎండి కాజా, జిల్లా కమిటీ సభ్యులు ఇరుగురాల లచ్చయ్య, తీట్ల శ్రీనివాస్, మామిడిపల్లి తిరుపతి, జంగవెల్లి నరేష్, ఆకుల రాజయ్య దేవేందర్, లక్ష్మణ్, అశోక్, ఆకుల నాగయ్య, నరేష్, శంకర్, రవి, గద్దల రాజు సిబ్బంది పాల్గొన్నారు.

### నియామకం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మండలంలోని గంగారం గ్రామానికి చెందిన పొదిల్ల సదానందంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిలపల్లి అంజి తెలిపారు.

### ఎల్‌వోసీ అందజేత

ఎలిగేడు, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి) : ఎలిగేడుకు చెందిన బాలసాని స్నిగ్ధ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరగా సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల ఎల్ఓసీని ఆదివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అందజేశారు.

# మానేరుపై మరో వంతెన..

(5వ పేజీ తరువాయి)

ఇరువైపులా అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో ఆ వంతెన పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఖమ్మంపల్లి వంతెన పూర్తికాగా, గత ఏడాది దానిని అధికారికంగా ఆరంభించారు. ఓడేడు వంతెనకు సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పిల్లర్లు నిర్మించి, కొన్నింటిపై గెడ్డర్లు వేసి వదిలిపెట్టారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు గెడ్డర్లు కింద పడడం గమనార్హం. గత ఏడాది నవంబర్ నెలాఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రూప్‌నారాయణపేట వద్ద మరో వంతెన నిర్మించాలని ప్రజల నుంచి డిమాండ్ వచ్చింది. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన చింతకుంట విజయరమణారావు తాను గెలిస్తే వంతెన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన గెలుపొందడంతో పాటు పార్టీ అధికారంలోకి రావడంతో ఐదు మాసాల నుంచి వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేసి, వారిపై ఒత్తిడి తీసుకు వచ్చారు. అది ఫలించి ఈనెల 18న వంతెన నిర్మాణానికి 80 కోట్ల రూపాయలు మంజూరు చేయడంతో ఓదెల మండల ప్రజలే గాకుండా పెద్దపల్లి, హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు మానవాళికి దిక్సూచి

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి దిక్సూచి అని మజ్లీస్ తహఫుజ్ ఖత్మే నబువత్ రిలీజియస్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొయుద్దీన్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ధర్మారం మండల కేంద్రంలోని మస్జిదే మహమ్మదియాలో ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఫ్తి ఘియాస్ మాట్లాడుతూ ఇస్లామీయ జీవన విధి, విధానాలను చూపించిన మహనీయుడు మహమ్మద్ ప్రవక్త అని చెప్పారు. కార్యక్రమంలో మౌలాన ఆసిముద్దీన్, మహమ్మద్ కలీం షరీఫ్, మహమ్మద్ బాబా, గౌస్, జఫర్ ఆలం, మేరాజ్, యునూస్ తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన వర్కర్స్‌కు నెలకు పదివేలు ఇవ్వాలి

సుల్తానాబాద్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు నెలకు పది వేల రూపాయల చొప్పున చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ డిమాండ్ చేశారు. మండల మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ సమావేశం ఆదివారం సుల్తానాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా సునీల్‌తో పాటు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూసల రమేష్ మాట్లాడుతూ భోజన వర్కర్ల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని, పది వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న సుల్తానాబాద్‌లో జరిగే మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఓదెల రమష్, లీలావతి, స్రవంతి, రచన, రత్నమాల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### 'మన ఊరు మన జ్యోతి'ని విజయవంతం చేయాలి

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన మన ఊరు మన జ్యోతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సొసైటీ వ్యవస్థాపకుడు లింగమల్ల శంకరయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కార్యక్రమానికి సంబంధించిన కర పత్రాలను సొసైటీ సభ్యులు విడుదల చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో నవంబర్ 10న కాల్వశ్రీరాంపూర్ మండల పరిషత్ కార్యాలయంలో మన ఊరు మన జ్యోతి కార్యక్రమంలో భాగంగా ఉద్యోగుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో సంస్థ కాళేశ్వరం జోనల్ అధ్యక్షులు రాజన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల సమ్మయ్య, మండల అధ్యక్షుడు రామచందర్, రైతు అధ్యక్షుడు చందు, రాజయ్య, రాజేశం, ఉమామహేశ్వర్, లింగమూర్తి, రమేష్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుడిపై దాడి

కోల్‌సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గంగానగర్‌లో ఆదివారం రాత్రి కాంగ్రెస్ నాయకుడు, లారీ యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. లారీ అసోసియేషన్ కార్యాలయం నుంచి గంగానగర్‌లోని తన ఇంటికి శ్రీనివాస్‌రెడ్డి వెళుతుండగా గంగానగర్ బోర్డు వద్ద కొందరు యువకులు బర్త్‌డే వేడుకలు జరుపుకుంటున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలైన కొందరు యువకులు శ్రీనివాస్‌రెడ్డిని చూసి రెచ్చగొట్టే విధంగా కాంగ్రెస్ నాయకత్వాన్ని, పాలనను దూషించినట్టు బాధితుడు పేర్కొన్నాడు. పుట్టిన రోజు వేడుకల్లో రాజకీయాలెందుకు అని తాను అన్నందుకు తనపై సాగర్, రాంబాబు, రవి, మరో 20మంది మూకుమ్మడిగా దాడి చేశారని బాధితుడు పేర్కొన్నారు. ఈ మేరకు రాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బీజేపీ సభ్యత్వ నమోదు



బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లోని 25, 26డివిజన్లలో ఆదివారం ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా సభ్యత్వ కన్వీనర్ క్యాతం వెంక టరమణ మాట్లాడుతూ సభ్యత్వ నమో దు లక్ష టార్గెట్ పెట్టుకున్నట్టు, ఇప్పటి వరకు 33వేల సభ్యత్వాన్ని పూర్తి చేసినట్టు చెప్పారు. ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఆయన చెప్పారు. కోడూరి రమేష్, గజ్జెల బాస్కర్, పవన్, విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్, మల్లయ్య పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుగొండ గ్రామానికి చెందిన బుర్ర మల్లయ్య అలాగే అనుబంధ గ్రామమైన జగన్నాథపురానికి చెందిన లింగయ్య గత కొన్ని రోజుల క్రితం మృతిచెందగా ఆదివారం బీజేపీ నాయకులు ఏగోలపు సదయ్య గౌడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట గడ్డం రాజయ్య, అంజిరెడ్డి, రవిగౌడ్,మ శ్రీనివాస్, రమేష్, మణికంఠలతో పాటు పలువురు పాల్గొన్నారు.

### హెడ్ కానిస్టేబుల్‌కు పదోన్నతి


కమాన్‌పూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎండీ ఖలీల్‌ఖాన్ ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. కరీంనగర్‌టౌన్, మంథని, ముత్తారం, జగిత్యాల, బసంత్‌నగర్, కొయ్యూరులలో కానిస్టేబుల్‌గా పని చేశారు. ఏఎస్ఐగా పదోన్నతి పొంది కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు.

### రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి):సుల్తానాబాద్ పట్టణంలోని ఖేలో ఇండియా శిక్షణ కేంద్రంలో గత కొన్ని రోజులుగా ఖోఖోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సురేష్ అన్నారు. స్థానిక మార్కండయ్య కాలనీలో తెలంగాణ క్రీడా మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన కె మహాలక్ష్మి,శ్వేత శ్రీ, అజయ్ తదితరులను డీవైఎస్‌వో సురేష్‌తో పాటు అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారులు, ఖేలో ఇండియా కేంద్రం కోచ్ గెల్లు మధూకర్, జాతీయ స్థాయి ఖోఖో క్రీడాకారులు గాజుల రాజమల్లు, వెంకటుమాపతి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, పీఈటీలు శంకరయ్య, తదితరులు అభినందించారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాలకుర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని బసంత్‌నగర్ తెలుగుమీడియం ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమేళనం జరిగింది. 1984 నుంచి 1994 వరకు 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.




### డిప్యూటేషన్లలో సీనియర్ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

గోదావరిఖని, అక్టోబరు 20: సింగరేణిలో సంవత్సరాల తరబడి పని చేస్తున్న సీనియర్ కార్మికులకు సర్ఫేసులలో డిప్యూటేషన్‌పై అవకాశాలు ఇవ్వకుండా జూనియర్ కార్మికులకు ఇవ్వడం సరికాదని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక చౌరస్తా సమీపంలోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జీ రాములు పాల్గొని మాట్లాడారు. సీనియర్ కార్మికులను కంపెనీ అధికారులు గుర్తించి వారికి న్యాయంగా డిప్యూటేషన్ అవకాశాలు కల్పించాలని యాజమాన్యానికి అనేక సార్లు విజ్ఞప్తి చేశామని, కొంత మంది దళారీలచే లక్షల రూపాయలు చేతులు మారి డిప్యూటేషన్ల దందాను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. సింగరేణి ఉన్నత అధికారులు దీనిపై దృష్టి సారించాలని, పారదర్శకత పాటించి ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలన్నారు. సింగరేణిలో 30-40 సంవత్సరాల క్రితం పనిచేసిన కార్మికులు మారు పేర్లు కలిగి ఉన్నారని, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించడంలో సింగరేణి యజమాన్యం అనేక రకాల ఇబ్బందులకు గురిచేస్తుందని, గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్, టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా మారు పేర్లను సరి చేస్తామని సింగరేణి కార్మికులకు హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదన్నారు. రిటైర్డ్ అయిన కార్మికుల కుటుంబాలు తమ వారసుల ఉద్యోగాల విషయములో విజిలెన్స్ విచారణల పేరిట అనేక కేసులు పెండింగ్‌లో ఉండడం వల్ల ఎదురు చూస్తున్నారని, వీటన్నింటిపై సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మారుపేర్లను సరిచేసి వారి కుటుంబాలకు ఉద్యోగాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు జక్కుల నారాయణ, నరేష్, ఎం కొమురయ్య, పీ శేఖర్, జీ మల్లేశం, ఈ రాజేందర్, పెగడపల్లి రాజనర్సు పాల్గొన్నారు.

### అధికారులపై చర్యలు తీసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 20: వకీల్‌పల్లె గనిలో జరిగిన ప్రమాదానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఎలక్ట్రీషియన్ ప్రమాదానికి గురైన స్థలాన్ని ఆదివారం రియాజ్ పరిశీలించారు. కార్మికులను అడిగి గనిలో రక్షణ చర్యలను తెలుసుకున్నారు. సర్ఫేస్‌లో పనిచేస్తున్న ట్రైనీ ఎలక్ట్రీషియన్‌తో బలవంతంగా గుడి మీదకు ఎక్కించి లైట్లు తీసే పని అప్పగించారని, గుడి మీద నుండి పడడంతో ట్రైనీ ఎలక్ట్రీషియన్‌కు గాయాలు అయినట్టు రియాజ్ తెలిపారు. సరైన పర్యవేక్షణ లోపంతో జరిగిన ప్రమాద కారకులపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రియాజ్ వెంట ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ దావు రమేష్ ఉన్నారు.

### మొసలి కన్నీరు కారుస్తున్న పుట్ట మధు

రామగిరి అక్టోబర్ 20: (ఆంధ్ర జ్యోతి) : సింగరేణి ఓబీ కాంట్రాక్టు కార్మికుల మీద మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మొసలికన్నీరు కారుస్తున్నారని మంథని నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. సింగరేణి కార్మికులకు సమానంగా ప్రైవేట్ కాంట్రాక్ట్ కార్మికులకు పండుగ అడ్వాన్స్ ఇప్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం చెందుతుందన్నారు. నాయకులు తోట చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క, కొమురయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, తులసిరామ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.



ధర్మారంలో..



మంథనిలో..



ఓదెలలో..

### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు..

వానాకాలం పంటల సాగుకు ప్రభుత్వం రైతుభరోసా కింద రైతు లకు డబ్బులు ఇవ్వక పోవడాన్ని నిరసిస్తూ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. పెద్దపల్లి, జూలపల్లి, ధర్మారం, రామగుండం, పాలకుర్తి, అంతర్గాం, మంథని, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, తదితర మండలాల్లో నిరసనలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



కమాన్‌పూర్‌లో..



పుట్టూరులో..



అంతర్గాంలో..



పెద్దపల్లిలో..



సుల్తానాబాద్‌లో..



జూలపల్లిలో..



ఎలిగేడులో...



కాల్వశ్రీరాంపూర్‌లో...